## క్లుప్తంగా

### నేషనల్ స్పేస్ సెటిల్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభ



సాత్విక్ వరణ్యను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: స్థానిక విద్యారణ్యపురిలోని శ్రీచైతన్య కరీంనగర్ ఐపీఎల్ పాఠశాల విద్యార్థి సాత్విక్ వరణ్య అమెరికా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ స్పేస్ సెటిల్‌మెంట్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఆలిండియా అకాడమిక్ కో–ఆర్డినేటర్ సతీశ్ శుక్రవారం ఆ విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కో–ఆర్డినేటర్ జయరాజు, ఏజీఎం రాజు, కో–ఆర్డినేటర్లు మహేశ్, ప్రవీణ్, నాయుడు, శివ కోటేశ్వరరావు, నరేందర్, వివిధ బ్రాంచీల ప్రిన్సిపాళ్లు, ఐపీఎల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

జూలపల్లి(పెద్దపల్లి): పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి నవీన్(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నెల క్రితం పచ్చకామెర్ల బారిన పడ్డాడు. స్వగ్రామానికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంటివద్ద పురుగుల మందు తాగిండు. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కాంపెల్లి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

### ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లికి చెందిన వేములవాడ స్వప్న(32) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై తాండ్ర నరేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. స్వప్నకు వివాహం కాగా కొద్ది రోజులకే భార్యభర్తలు విడిపోయారు. అప్పటి నుంచి తల్లితో ఇంటి వద్దనే ఉంటుంది. ఈక్రమంలో అనారోగ్యం బారినపడటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని, తల్లి కళవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి మృతిచెందాడు. కరీంనగర్ రామచంద్రాపూర్ కాలనీకి చెందిన సాగర్‌రావు(69) రోడ్డు దాటుతుండగా సాయిబాబా ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. బస్సు పైనుంచి వెళ్లడంతో శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొత్తపల్లి(కరీంనగర్): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం రేకుర్తి చౌరస్తాలో పట్టుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

# లెక్కాపత్రం లేకుంటే జప్తే..

- స్వాధీన సొమ్ము విడుదలపై కమిటీ పర్యవేక్షణ
- జప్తుపై ప్రామాణిక కార్యాచరణ విధానం అమలు
- రూ.50వేలు దాటితే తిప్పలే

**కమిటీ ఇలా..**

నోడల్ అధికారి: శ్రీధర్, డీఆర్డీవో
కన్వీనర్: నాగరాజు, డీటీవో
సభ్యులు: లింగం, ఇన్‌స్పెక్టర్ ఇన్‌కమ్ టాక్స్



కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల క్రమంలో నిఘా బృందాల తనిఖీల్లో లక్షల్లో నగదు పట్టుబడుతోంది. ఈ నెల 16నుంచి కోడ్ అమల్లోకి రాగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్ టీంలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సదరు నగదు విడుదల, జప్తు వంటి అధికారాలను ప్రత్యేక కమిటీ నిర్ణయించనుంది. అందుకు జిల్లాకు కమిటీని నియమించగా ఎన్నికల నిబంధనల మేరకు పర్యవేక్షిస్తోంది. ఎన్నికల సమయంలో లెక్కాపత్రం లేని నగదు తరలింపుపై నిఘా తీవ్రంగా ఉంటుంది. ప్రధాన రహదారులపై పోలీసులతోపాటు నిఘా బృందాలు మకాం వేసి మరీ తనిఖీలు చేస్తుంటాయి. ఒకవేళ పెద్ద ఎత్తున డబ్బు చిక్కితే అధికార యంత్రాంగం ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేది ఆరా తీస్తుంది. లెక్కాపత్రం సరిగా లేకుంటే మాత్రం ఆ డబ్బును జప్తు చేసి ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తారు. ఒకవేళ లెక్కల పత్రాలు సరిగా ఉంటే మాత్రం వెంటనే విడిచిపెట్టేందుకు ఆస్కారముంది. కాగా లెక్కలు సరిగానే ఉన్నాయని భావించి క్షేత్రస్థాయి అధికారులే నిర్ణయం తీసుకొని వదిలిపెట్టడం కుదరదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎక్కడైనా డబ్బు పట్టుకుంటే తప్పనిసరిగా నియమిత కమిటీ దృష్టికి తీసుకొచ్చేలా ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్వోపీ) అమలు చేస్తున్నారు.

**ఎక్కువ మొత్తమైతే ఇక అంతే**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ పేరిట వాహనాలను తనిఖీలు చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచారాన్ని బట్టి అవసరమైతే లాడ్జిలు, ఇళ్లలోనూ సోదాలు చేసేందుకు ఈ బృందాలు సమాయత్తంగా ఉన్నాయి. ఈ బృందాలతోపాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైతం నిఘా తీవ్రతరం చేశారు. ఈ అక్రమ తరలింపు వ్యవహారంలో కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది దారి తప్పే అవకాశముందనే ప్రచారం నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కమిటీని నియమించింది. క్షేత్ర స్థాయి తనిఖీ బృందాలు పెద్ద ఎత్తున డబ్బు పట్టుకుంటే.. ఆధారాలు సరిగానే ఉన్నాయని సత్వరమే విడిచిపెట్టే అవకాశం లేదు. తప్పనిసరిగా డబ్బు పట్టుకున్న విషయాన్ని కమిటీ దృష్టికి తీసుకురావాల్సిందే.

**రూ.10 లక్షలు దాటితే సమాచారం**

ఒకవేళ లెక్కాపత్రం సరిగా ఉన్నా సరే రూ.10 లక్షల కంటే ఎక్కువ సొమ్ము తరలిస్తుంటే మాత్రం కమిటీ తప్పనిసరిగా ఆదాయ పన్ను శాఖ నోడల్ అధికారికి సమాచారం అందిస్తున్నారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ యంత్రాంగం.. సదరు వ్యక్తులకు తాఖీదులు జారీ చేస్తోంది. వివరణ సంతృప్తికరంగా ఉంటే పర్వాలేదు. లేకుంటే లెక్క ప్రకారం పన్ను మినహాయించుకొని తిరిగి ఇవ్వనున్నారు.

**సుమోటోగా విచారణ**

ప్రస్తుతం రూ. 50వేల కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు తరలిస్తూ తనిఖీ బృందాలకు చిక్కితే సదరు డబ్బు ఎక్కడిదని ఆరా తీస్తున్నారు. ఆ వివరాల్ని వెంటనే రిటర్నింగ్ అధికారితోపాటు పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్నికల విభాగం యంత్రాంగం ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు కమిటీ దృష్టికి తీసుకెళుతోంది. ఒకవేళ పత్రాలు సరిగా ఉండి.. ఆ డబ్బు ఎన్నికల వ్యవహారంతో సంబంధం లేనిదేనని కచ్చితంగా నిర్ధారించుకుంటే మాత్రమే స్థానిక రిటర్నింగ్ అధికారి సూచనతో వదిలేస్తున్నారు. ఏమాత్రం అనుమానమొచ్చినా కమిటీ సుమోటోగా ఆ వ్యవహారంపై విచారణ జరపనుంది. ఆ తరహా ఘటనల గురించి రోజువారీ నివేదికలు రూపొందించనుంది. ఒకవేళ సొమ్మును జప్తు చేస్తే మాత్రం అప్పీలుకు వెళ్లేందుకు అవకాశం ఇస్తోంది. ఎవరికి అప్పీలు చేసుకోవాలనే విషయాన్ని డబ్బు తరలిస్తున్న వ్యక్తులకు తెలియజేస్తోంది.

# పోలీసులమని చెప్పి..

- వృద్ధుడి దగ్గరి నుంచి 20 గ్రాముల బంగారం చోరీ

జగిత్యాలక్రైం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో డబ్బులు, బంగారం వెంట ఉంచుకోవద్దంటూ పోలీసులమని చెప్పి వృద్ధుడి 20 గ్రాముల బంగారాన్ని గుర్తుతెలియని దొంగలు సినీ ఫక్కీలో చోరీ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన గుగ్గిళ్ల చంద్రమౌళి అనే వృద్ధుడు శుక్రవారం టవర్ సర్కిల్‌లో పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చాడు. పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. ఇద్దరు వ్యక్తులు అడ్డు వచ్చి తాము పోలీసులమని ఆపారు. ఎన్నికల కోడ్ ఉందని, ఏమైనా డబ్బులున్నాయా అని అడగగా.. ఎలాంటి డబ్బు లేదని చెప్పాడు. చేతికున్న రెండు ఉంగరాలు, మెడలో ఉన్న బంగారు చైన్ తీయించారు. జేబులో పెట్టుకోమని నమ్మించి ఓ పేపర్‌లో బండరాళ్లు చుట్టి వృద్ధుడికిచ్చి బంగారం తీసుకొని వెళ్లిపోయారు. కొంతసేపటికి తేరుకున్న చంద్రమౌళి పేపర్ చూసేసరికి బండరాళ్లున్నాయి. మోసపోయానని గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**కరీంనగర్‌లో బంగారం చోరీ**

కరీంనగర్‌క్రైం: నగరంలోని శనివారం మార్కెట్ సమీపంలో పోలీసుమని చెప్పి బంగారం చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. గాంధీరోడ్డుకు చెందిన గజవాడ రవీందర్ అనే వ్యక్తి శనివారం మార్కెట్ సమీపంలో ఒక బ్యాగు పట్టుకొని నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు రెండు బైక్‌లపై వచ్చి పోలీసులమని చెప్పారు. ఎన్నికల కోడ్ సందర్భంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. అతని మెడలో ఉన్న బంగారు చైన్, ఉంగురాలను ప్యాకింగ్ చేసి పెట్టుకోవాలని, దొంగలున్నారని చెప్పారు. అతడి దృష్టి మరల్చి రూ.60వేల విలువ గల బంగారు వస్తువులున్న కవర్ తీసుకొని రాళ్లున్న కవర్ అతని బ్యాగులో పెట్టారు. కొద్ది దూరం నడిచిన రవీందర్ బ్యాగు చూసుకునేసరికి రాళ్లుండడంతో.. అతని కుమారుడు గజవాడ వెంకట్‌కుమార్‌కు తెలిపాడు. అతడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సినీ ఫక్కీలో 15 తులాల బంగారం చోరీ



జగిత్యాల కొత్త బస్టాండ్‌లో రోదిస్తున్న మహిళ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళ బ్యాగులో నుంచి సినీ ఫక్కీలో 15 తులాల బంగారం, రూ.3వేల నగదు, సెల్‌ఫోన్ చోరీకి గురయ్యాయి. బాధితురాలి వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌కు చెందిన తురిగే మంగారాణి శుక్రవారం ఉదయం బీర్‌పూర్ మండల కేంద్రంలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. శుభకార్యం ముగించుకొని బీర్‌పూర్ నుంచి జగిత్యాలకు వచ్చి శుక్రవారం సాయంత్రం మెట్‌పల్లి బస్సు ఎక్కింది. టికెట్ కోసం ఆధార్ కార్డు తీస్తుండగా.. బ్యాగు చైన్ ఓపెన్ చేసి ఉండటంతో ఆందోళనకు గురై బ్యాగును పరిశీలించింది. అందులో ఉన్న 15 తులాల బంగారు నగలు, రూ.3వేల నగదు, సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితురాలు పట్టణ పోలీసులకు సమాచారమందించగా.. పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని సీసీ పుటేజీలను పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టగా.. బాధితురాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

# పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



చెట్లపొదల్లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు

సుల్తానాబాద్‌రూరల్: దుబ్బపల్లి గ్రామశివారులో ఆర్టీసీ బస్సు శుక్రవారం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కరీంనగర్ నుంచి మంథని వైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. దుబ్బపల్లి శివారులోకి చేరుకుంది. ఇదే సమయంలో డ్రైవర్ రతన్ గుట్కా వేసుకుంటున్నాడు. పక్కనుంచి లారీ వెళ్తుంగా ఆర్టీసీ డ్రైవర్ స్టీరింగ్ రోడ్డువైపు తిప్పాడు. దీంతో బస్సు అదుపుతప్పి రాజీవ్ రహదారి పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఆ సమయంలో బస్సులు దాదాపు 40మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఇందులో దేవిక(సెంటినరీకాలనీ), మల్లయ్య(మంథని), శ్రీరాముల స్వామి(కరీంనగర్) తలకు గాయాలు తీవ్రగాయాలు కాగా, మిత్తాగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికుడు శ్రీరాముల స్వామి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరించారు.

# గన్ పౌడర్ పట్టివేత



గోదాంలోని గన్‌పౌడర్‌ను సీజ్ చేసిన పోలీసులు

సైదాపూర్: మండలంలోని జాగీర్‌పల్లి గుట్టల మధ్య పేలుడు పదార్థాలు భద్రపరిచే గోదాంపై శుక్రవారం హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో హుజూరాబాద్‌రూరల్ సీఐ వెంకట్‌గౌడ్, ఎస్ఐ ఆరోగ్యం, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. కన్నెబోయిన మహేందర్ కొన్నేళ్లుగా గోదాంలో అక్రమంగా అనుమతి లేని పేలుడు పదార్థాలు నిల్వ చేసి సరఫరా చేస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని, 142 కాటన్ బాక్సుల్లో 21.30 క్వింటాళ్ల గన్‌పౌడర్ దొరికిందని, రూ.74,764 విలువ ఉంటుందని, గన్‌పౌడర్ సీజ్ చేసి మహేందర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు. అక్రమంగా ఎవరైనా పేలుడు పదార్థాలు ఉపయోగించినా, అమ్మినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

### ఎల్లమ్మ గుడిలో మృతదేహం



గుడిలో మృతదేహం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ గుడి ఆవరణలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై మల్లేశ్ తెలిపారు. రాత్రి సమయంలో దాహం తీరక డీహైడ్రేషన్‌కు గురై ఆ వ్యక్తి మరణించి ఉంటాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చామన్నారు. తెల్లచొక్కా, నీలిరంగు ప్యాంటు ధరించి సుమారు(45)ఏళ్ల వయసు ఉందన్నారు. ఆచూకీ తెలిస్తే సెల్ నంబరు 8712656504 నంబరుకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

### బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



తిరుపతి (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్‌కు చెందిన కనవేని తిరుపతి(35) బైక్ అదుపుతప్పి, చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. తిరుపతి ఎలబోతారంలో హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తాహెర్‌కొండాపూర్ నుంచి బైక్‌పై ఎలబోతారం వేగంగా వెళ్తున్నాడు. జూబ్లీనగర్ శివారులో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను సమీపంలోని పొలంలో ఎగిరిపడ్డాడు. తల బురదలో చిక్కుకొని, ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కు డ్రా చేశారని ఫిర్యాదు



కె.పద్మ పేరుతో మంజూరైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కు

బోయినపల్లి(చొప్పదండి): తనకు వచ్చిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఇస్తానని చెప్పి చివరకు మోసం చేసి డ్రా చేసుకున్నారని మండలంలోని విలాసాగర్‌కు చెందిన కొండ పద్మ ఫిర్యాదు మేరకు రామన్నపేటకు చెందిన కన్నం పద్మ, భర్త మధుపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై పృథ్వీధర్ తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన కొండ యుగంధర్ కోవిడ్‌తో 2021 మే 6వ తేదీన మృతిచెందాడు. యుగంధర్ కోవిడ్ చికిత్సకు రూ.1.60 లక్షలు ఖర్చు కాగా సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో రూ. 60 వేలు మంజూరైనట్లు పద్మకు మెసేజీ వచ్చింది. కాగా రామన్నపేటలో కన్నం పద్మకు ఆపరేషన్ కాగా ఆమె భర్త మధు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. విలాసాగర్‌కు చెందిన కె. పద్మ పేరుతో ఉన్న చెక్కును రామన్నపేటకు చెందిన కె. పద్మ నమ్మించి డ్రా చేసుకుందని, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులో కె. పద్మ అని ఉండటంతో రామన్నపేట కొండ పద్మ చెక్కు డ్రా చేసుకుందని, దంపతులపై చర్యలు తీసుకోవాలని కొండ పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

# మత్తుకు అలవాటుపడి.. విక్రేతగా మారి..

- గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ యువకుడు

పెద్దపల్లిరూరల్: మత్తుకు అలవాటుపడ్డ ఓ యువకుడు.. తను వినియోగించే గంజాయి విక్రయిస్తే ఉచితంగా అవసరం తీరుతుందని భావించి విక్రేతగా మారాడు. ఈక్రమంలో పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన విజ్జగిరి సంతోష్ కొంతకాలంగా పెద్దపల్లి ముత్యాల పోచమ్మవాడలోని ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. పట్టణానికి చెందిన ఆసిఫ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసేవాడు. ఈక్రమంలో తనలో వచ్చిన ఆలోచనతో తాను కొనుగోలు చేసిన గంజాయి ప్యాకెట్లను కొందరు యువకులకు అధిక ధరకు విక్రయిస్తూ వస్తున్నాడు. శుక్రవారం గంజాయి విక్రయిస్తూ సంతోష్ పోలీసులకు చిక్కాడని ఎస్సై సుధాకర్‌రావు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. యువత గంజాయి మత్తుకు బానిసలుగా మారి, ఆర్థికావసరాలను సులువుగా తీర్చుకోవచ్చనే దురాశతో వెళ్లి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని ఏసీపీ గజ్జి కృష్ణ సూచించాడు.. సీఐ కృష్ణ, ఎస్సైలు సుధాకర్‌రావు, మల్లేశ్ గంజాయి విక్రేతల ఆటకట్టిస్తున్నారని ఏసీపీ అభినందించారు.

# నావిగేషన్ ద్వారా కణితి తొలగింపు



మాట్లాడుతున్న వైద్యుడు కిరణ్

జగిత్యాల: నావిగేషన్ అనే పద్ధతి ద్వారా మానవ శరీరంలో బ్రెయిన్ ట్యూమర్ సంబంధించిన కణితి తీసివేసినట్లు ప్రముఖ వైద్యుడు, యశోద ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ కె.ఎస్.కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాలలోని కనెక్ట్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు వచ్చిన సందర్భంగా ధర్మపురికి చెందిన అభినయ్ అనే 25 సంవత్సరాల యువకుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆస్పత్రికి రాగా.. ఆయనకు నావిగేషన్ ద్వారా సర్జరీ చేసి కణితి తీసివేశారు. ఇది అత్యంత అరుదైన చికిత్స అని, బ్రెయిన్ ట్యూమర్‌కు సకాలంలో చికిత్స చేయించుకోవాలని, భయపడాల్సిన పని లేదన్నారు. అభినయ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిందని అన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### వాగులో పడి యువకుడి మృతి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం చౌలమద్ది పెద్దవాగులో పడి ఒకరు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో కూలీగా చేస్తున్న ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన పూజారి శ్రీనివాస్(30) శుక్రవారం తోటి కూలీలతో కలిసి వాగులో స్నానం చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. అక్కడున్న కూలీలు శ్రీనివాస్ కోసం గాలింపు చేపట్టగా.. అప్పటికే మృతిచెందాడు.

### రైలు నుంచి పడి వ్యక్తి దుర్మరణం

జమ్మికుంట: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాలు జమ్మికుంట, ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య ఉప్పల్ రైల్వేగేట్ సమీపంలో పట్టాల పక్కన శుక్రవారం గుర్తు తెలియని (40) వ్యక్తి మృతదేహం లభ్యమైందని, ఎలాంటి గుర్తింపుకార్డులు లభించలేదని, మృతదేహంపై తెలుపు షర్ట్ బ్రౌన్ లైన్ డిజైన్, బూడిద రంగు ప్యాంట్ ఉందని, షర్ట్‌పై కటిన్ టైలర్ హనుమకొండ అరు లేబుల్ ఉందని, మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని వివరాలకు 9949304574, 8712658604 ఫోన్ నంబర్లను, రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిని సంప్రదించాలన్నారు.

# కేసీఆర్ రాకతో గందరగోళం



కరీంనగర్‌రూరల్: మండలంలోని మొగ్దుంపూర్‌కు శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్ కారులో రాగానే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ నాయకులతోపాటు మీడియా ప్రతినిధులు ఒక్కసారిగా ముందుకు రావడంతో గందరగోళం నెలకొంది. తోపులాట జరగడంతో కేసీఆర్ 5 నిమిషాలుపాటు కారులోనే ఉండిపోయారు. చివరకు రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ వినోదకుమార్ వారికి సర్దిచెప్పి, పక్కకు పంపించడంతో ఆయన కిందికి దిగారు. కేసీఆర్‌కు రక్షణగా పోలీసులు తాడు పట్టుకోవడంతో రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలిసే అవకాశం లేకుండా పోయింది. దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్ కందుల రమేశ్‌తోపాటు కొందరు రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అనుమతించారు.

**రైతులు, మీడియా ప్రతినిధుల పడిగాపులు**

మొగ్దుంపూర్‌కు కేసీఆర్ రాక కోసం రైతులు, మీడియా ప్రతినిధులు పడిగాపులు కాశారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆయన మొగ్దుంపూర్ రావాల్సి ఉండగా రెండున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1 గంటకు వచ్చారు. అప్పటివరకు స్థానిక అన్నదాతలు, బీఆర్ఎస్ నాయకులతోపాటు హైదరాబాద్, కరీంనగర్ నుంచి వచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తాగునీరు లేక ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రతను భరించలేక చెట్ల నీడను ఆశ్రయించారు.

**దొంగల చేతివాటం...**

పొలంబాట కార్యక్రమంలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. బీఆర్ఎస్ నాయకుల పర్సులు కొట్టేశారు. దుర్శేడ్ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు జేబులోని రూ.15 వేలను దొంగిలించారు. ఓ వ్యక్తి నారాయణరావుపల్లె బీఆర్ఎస్ నాయకుడు అంజయ్య జేబులో నుంచి డబ్బులు తీస్తుండగా కొందరు కార్యకర్తలు పట్టుకొని, కొట్టారు. అతని వద్ద నుంచి రూ.6 వేలు స్వాధీనం చేసుకున్నారు.

**పొలమంతా ఎండిపోతోంది**

నేను నాలుగెకరాల్లో వరేస్తే నీరందక పొలమంతా ఎండిపోతోంది. బావిలో నీళ్లు అడుగంటాయి. పూడిక తీసినా లాభం లేకుండా పోయింది. ఎకరానికి రూ.40 వేల చొప్పున రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఎకరమైనా పారేటట్టు లేకపోవడంతో విడిచిపెట్టాను.

– పొలగాని సంపత్, రైతు, మొగ్దుంపూర్

**గొర్రెలకు విడిచిపెట్టాను**

నాలుగెకరాల్లో వరి నాటేస్తే బావిలోని నీళ్లు సరిపోలేదు. పొట్ట దశలో నీళ్లు లేకపోవడంతో పొలమంతా ఎండింది. చేసేదేమీ లేక గొర్రెల మేతకు విడిచిపెట్టాను. రూ.1.50 లక్షల పెట్టుబడి నష్టపోయాను.

– ర్యాగటి హన్మయ్య, రైతు, మొగ్దుంపూర్

# అప్పుల బాధతో కార్మికుని ఆత్మహత్య

- నారాయణపూర్‌లో విషాదం



ముత్తయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన కొడుకుకు అక్కడ పని సరిగ్గా లేకపోవడం.. గ్రామంలో పనులు లేక.. సొంతింటి నిర్మాణం సగంలోనే ఆగిపోవడం..అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ భవన నిర్మాణ కార్మికుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో విషాదం నింపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని దుమాలకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు సిరిపురం ముత్తయ్య(65) బతుకుదెరువు కోసం 31 ఏళ్ల క్రితం నారాయణపూర్‌కు కుటుంబంతో వచ్చాడు. స్వగ్రామంలో ఉపాధి లేక ముత్తయ్య కుమారుడు శ్రీనివాస్ గల్ఫ్ వెళ్లాడు. అక్కడి కంపెనీలో పనులు లేక అప్పులు తీర్చలేకపోయాడు. ఈక్రమంలోనే గ్రామంలో ముత్తయ్య కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో అప్పులు పెరిగి.. తీర్చే మార్గం కనిపించక గురువారం గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య దేవవ్వ, కుమారుడు శ్రీనివాస్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

### ఇద్దరి అరెస్టు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం రాజారాంతండా గ్రామంలో అపావత్ బిక్కి అనే వృద్ధురాలి మెడలోంచి అర తులం బంగారు చైన్ లాక్కెళ్లిన ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్ట ప్రాంతానికి చెందిన సదుల నరేశ్, కడమంచి ప్రశాంత్ అనే ఇద్దరు వ్యక్తులు ఈనెల 4న రాత్రి బైక్‌పై రాజారాం తండాకు వచ్చారు. ఒంటరిగా ఉన్న బిక్కి అనే వృద్ధురాలి మెడలోంచి అర తులం బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. వృద్ధురాలు అరవడంతో గ్రామస్తులు వెంబడించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేకంగా గాలింపు చేపట్టారు. శుక్రవారం ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. దొంగతనం చేసినట్లు అంగీకరించారు. సదుల నరేశ్, కడమంచి ప్రశాంత్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



## రాష్ట్రస్థాయి జిజ్ఞాసలో ప్రతిభ

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ పోటీలలో ప్రతిభ చూపారు.

### రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శుక్ర(సా॥) | సహర్ శని(ఉ॥) |
|---|---|---|
| కరీంనగర్ | 6.28 | 4.37 |
| పెద్దపల్లి | 6.35 | 4.44 |
| రాజన్న సిరిసిల్ల | 6.35 | 4.45 |
| జగిత్యాల | 6.35 | 4.44 |

గరిష్టం/కనిష్టం
41.0/28.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ప్రజలతో స్నేహంగా మెలగాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



వేములవాడరూరల్: ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, ఫిర్యాదులపై తమ పరిధిలో ఉన్న న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని అన్ని ఫైళ్లను పరిశీలించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి ఉన్నారు.

### ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతులు ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు సాధించాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ మంజుల పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మొక్కజొన్న పంటలను గురువారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు మధుకర్‌రావు, శ్రావణి, కో–ఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి చాడ భూంరెడ్డి, విస్తరణ అధికారులు శ్రీధర్, శ్రీశైలం, రావెప్ పాల్గొన్నారు.

### ఓటుహక్కుపై అవగాహనకు సైకిల్‌యాత్ర



వేములవాడ: ఓటుహక్కు సామాజిక బాధ్యత అంటూ సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం రాజన్నగుడికి చేరుకుంది. ఆర్‌ఐ గణేశ్, స్థానికులు రాజును అభినందించి సంఘీభావం ప్రకటించారు. పీవీ నరసింహారావు సేవాసమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఐదు రోజుల క్రితం చేపట్టిన సైకిల్‌యాత్ర గురువారం వేములవాడకు చేరుకుంది. రాజన్నను దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకున్నారు. ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని రాజు కోరారు.

### నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి

- బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సద్దాం



సిరిసిల్లటౌన్: పదేళ్లుగా ఎదురుచూస్తున్న నేరెళ్ల బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సద్దాం కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేరెళ్ల ఘటనలో అప్పటి ప్రభుత్వం కావాలనే తాత్సారం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి దోషులను శిక్షించాలని కోరారు. బాధితులకు న్యాయం, దోషులకు శిక్ష పడే వ రకు పోరాటం కొనసాగుతుందన్నారు. బాధితులు కోల హరీశ్, పెంట బాలయ్య, పశువుల ఈశ్వర్, బత్తుల మహేశ్, చీకోటి శ్రీనివాస్, చెప్యాల బాలరాజు, గంధం గోపాల్ పాల్గొన్నారు.

### కన్నవాళ్లను పోషించే బాధ్యత వారసులదే..



సిరిసిల్లకల్చరల్: కన్నవాళ్లను పోషించే బాధ్యత వారసులదేనని సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య పేర్కొన్నారు. వస్త్రవ్యాపార సంఘం భవనంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. వయోభారంతో ఉన్న సీనియర్ సిటిజన్లకు ఎదురవుతున్న సమస్యలను దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 70 ఏళ్లు నిండిన బుచ్చయ్యను సత్కరించారు. సంఘం ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, దొంత దేవదాస్, శ్రీగాద మైసయ్య, కోడం నారాయణ పాల్గొన్నారు.

# వరి ఆశలు ఆవిరి



ఇతను చందుర్తి మండలం బండపల్లికి చెందిన యువరైతు కటుకం మల్లికార్జున్. తనకున్న ఆరు ఎకరాల్లో యాసంగి సీజన్‌లో వరినాట్లు వేశాడు. నీరు లేక ఐదెకరాల పొలం ఎండిపోయింది. వరి సాగు కోసం మల్లికార్జున్ రూ.80వేల వరకు పెట్టుబడి పెట్టాడు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కాల్వ ద్వారా సాగు నీరు వచ్చేది. ఈ ఏడాది కాల్వ నీరు రాక పొలం ఎండిపోయింది.



బోరు వద్ద నిల్చున్న ఇతను గుమ్మడి అంజయ్య. వీర్నపల్లికి చెందిన అంజయ్య ఎకరం 20 గుంటల్లో వరి వేశాడు. పొలం పొట్ట దశలో ఉండగా.. బోరు ఎత్తిపోయింది. వెంటనే పొలాన్ని కాపాడుకునేందుకు కొత్తగా బోరు వేశాడు. 800 అడుగుల లోతు బోరు వేసినా చుక్క నీరు రాలేదు. బోరు వేసేందుకు రూ.3లక్షలు అప్పులు చేయాల్సి వచ్చింది. అయినా.. పంట దక్కలేదు. దీంతో అంజయ్య తీవ్ర నిరాశకు గురయ్యాడు.

ఎండిన వరి పొలాన్ని చూపుతున్న ఇతను జిల్లెల్ల వెంకట్‌రెడ్డి. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన వెంకట్‌రెడ్డికి ఐదెకరాల పొలం ఉండగా.. నీరు ఉందని భావించి నాలుగు ఎకరాల్లోనే పంటలు సాగు చేశాడు. పొట్ట దశలో ఉండగా నీరందక ఎకరం పొలం ఎండిపోయింది. ఆ పొలంలో ఎడ్లను మేపుతున్నాడు. వెంకట్‌రెడ్డికి ఎండిన పొలంతో రూ.30వేల వరకు నష్టం వాటిల్లింది.

- అడుగంటిన నీరు.. ఎండిన పంటలు
- 1,114.26 ఎకరాల్లో ఎండిన వరి
- రైతుల భగీరథ ప్రయత్నాలు
- జిల్లాలో బాధిత రైతులు 6040 మంది





సిరిసిల్ల: జిల్లాలో బోర్లు ఎత్తిపోయి.. పంటలు ఎండిపోతున్నాయి. కాల్వలు పారక చేతికొచ్చే దశలో పంటలు చేజారిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏకంగా 6,040 మంది రైతులకు చెందిన 1,114.26 ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయినట్లు ప్రాథమిక అంచనాలు. ఈమేరకు రైతులకు రూ.5.57 కోట్ల మేరకు పంట నష్టం జరిగింది.

**పెరిగిన వరి విస్తీర్ణం**

వానాకాలం సీజన్‌లో సాధారణ వర్షాల కంటే మెరుగైన వానలు పడ్డాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరడం, వాగులు పారడంతో రైతులు వరి పంట సాగుచేశారు. విద్యుత్ సరఫరా వ్యవసాయానికి 18 గంటలు ఉండడంతో రైతులు వరిపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో 1,73,742 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. విస్తీర్ణం పెరగడంతో భూగర్భ జలాలు పడిపోయి పొలాలు ఎండిపోయాయి. గతంలో మధ్యమానేరు, ఎగువమానేరుకు గోదావరి జలాలను ఎత్తిపోయడంతో నీటి ఇబ్బందులు పెద్దగా రాలేదు. ఈ ఏడాది సాగునీటి కొరత తీవ్రమై పంటలు ఎండిపోయాయి.

**రైతులు భగీరథ ప్రయత్నాలు**

పంటలను దక్కించుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. బోర్లు ఎత్తిపోవడంతో సాగునీటి వేటలో బోర్లు వేస్తున్నారు. ఎంత లోతుకు బోర్లు వేసినా నీటి చుక్క రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతులు ఒక్కటికి మించి బోర్లు వేస్తూ... అప్పుల పాలయ్యారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోవడం రైతులను ఆవేదనకు లోను చేసింది. ఎండిన పంటను పశుగ్రాసంగా వినియోగించడం దారుణం.

**జిల్లా వ్యవసాయ స్వరూపం ఇలా..**

| |
|---|
| వ్యవసాయ కనెక్షన్లు : 74,754 |
| వరి సాగు : 1,73,742.28 ఎకరాలు |
| ఎండిన పంటలు : 1,114.26 ఎకరాలు |
| బోర్లు : 41,104, బావులు: 28,124 |
| రైతులు: 84,109 |



గొర్రెలు మేస్తున్న పొలం వద్ద దీనంగా కూర్చున్న ఇతను కాపరవేణి మహేశ్. గంభీరావుపేట మండలం గజసింగారం గ్రామానికి చెందిన మహేశ్ బోరు బావి ఉండడంతో రెండు ఎకరాల్లో వరి వేశాడు. బోరులో నీరు అడుగంటిపోయి తక్కువగా పోసింది. దీంతో ఎకరం పొలం చేతికందే దశలో ఎండిపోయింది. నీరు లేక బోరు ఎత్తిపోవడంతో పంట ఎండిపోయి మహేశ్ రూ.30వేలు నష్టపోయాడు.



ఇతను ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన లకావత్ శ్రీనివాస్. మూడు ఎకరాల్లో వరి వేశాడు. మూడు బోర్లు ఉండడంతో నమ్మకంగా యాసంగి సాగుచేశాడు. కానీ ఆ మూడు బోర్లు ఎత్తిపోవడంతో పొలం ఈనిన తర్వాత ఎండిపోయింది. 20 రోజుల కిందట రూ.లక్ష వెచ్చించి 550 అడుగుల లోతు బోరు వేశాడు. కానీ నీరు రాలేదు. దీంతో పంట ఎండిపోయి శ్రీనివాస్‌కు పంటపై పెట్టిన రూ.50వేలు నష్టపోయాడు. బోరుకు వెచ్చించిన రూ.లక్ష మీద పడింది.

## తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడండి

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్



సమీక్షిస్తున్న ఆర్వీ కర్ణన్, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో తాగునీటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పనిచేస్తూ సరఫరా చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ అనురాగ్ జయంతి సమక్షంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. సంక్షోభ సమయంలోనే పనితీరు పరీక్షకు గురవుతుందని, మిషన్ భగీరథ అధికారులు మండల పరిషత్, జిల్లా పరిషత్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో తాగునీటి వ్యవస్థ, మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం అందుతున్న తాగునీరు ఇతర వివరాలను మండలాల వారీగా తెలుసుకొని పలు సూచనలు చేశారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు పూర్తి స్థాయిలో నిత్యం 27.81 ఎంఎల్‌డీల నీటి సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో 43.45 ఎంఎల్‌డీల డిమాండ్‌కు 35.59 ఎంఎల్‌డీలు సరఫరా అవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిడ్ మానేర్‌లో 7.72 టీఎంసీల నీరు ఉందని తాగునీటి సరఫరా కోసం సమృద్ధిగా అందుబాటులో ఉందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారానే ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్య తలెత్తితే స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని సూచించారు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ వరకు ముందుగా నీరు చేరుకునేలా చూడాలన్నారు. మిషన్‌భగీరథ అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలు విధుల్లో ఉండాలని సూచించారు. నీటి సరఫరా పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**సమ్మర్‌యాక్షన్‌తో సిద్ధం**

జిల్లాలో ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేసేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేసినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాలు, వేములవాడ, సిరిసిల్ల మున్సిపాల్టీలలో ఉన్న బోర్ బావులు, పంపులు, స్థానిక నీటి వనరులను మరమ్మతు చేసినట్లు వివరించారు. జిల్లాలో 136 పనులకు రూ.2.49 కోట్లు మంజూరు చేసి 60 పనులు పూర్తి చేశామని, మిగిలిన 75 పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం అగ్రహారంలోని మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎస్.ఖీమ్యానాయక్, జెడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, మిషన్ భగీరథ ఈఈలు జానకి, విజయ్, భూగర్భజల శాఖ అధికారి నర్సింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ పాల్గొన్నారు.

## రాజకీయం వద్దు..మానవత్వం చూపండి

- వస్త్రపరిశ్రమ, అనుబంధాల సంఘాల పాదయాత్ర



సిరిసిల్లలో వస్త్రపరిశ్రమ సంఘాల పాదయాత్ర

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమ మూతపడింది.. సర్కారు బకాయిలు రావాల్సి ఉన్నాయి.. నేతన్నలకు పనిలేకుండా ఉంది.. దీనిపై రాజకీయం వద్దు..మానవత్వం చూపాలని సిరిసిల్ల పరిశ్రమ వర్గాలు కోరాయి. బకాయిలు, పరిశ్రమ మనుగడ, నేతన్నలకు ఉపాధి కోసం ఈనెల 6న సిరిసిల్లలో చేపడుతున్న 'నేతన్నల గర్జనసభ' కోసం గురువారం సిరిసిల్లలో పాదయాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్రపరిశ్రమ మూడు నెలలుగా సంక్షోభంలో కూరుకుపోయిందని.. కాపాడాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నిరసనగా నిర్వహించే గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. మండల సత్యం, మూశం రమేశ్, పంతం రవి, వెల్దండి దేవదాసు, తాటిపాముల దామోదర్, కోడం రమణ, మోర అజయ్, వెల్దండి శంకర్, సిరిసిల్ల రవి, సిరిమల్లె సత్యం, కిషన్, శ్రీనివాస్, దామోదర్, దేవదాసు, రమేశ్, రాజు, శీను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



### సల్లంగా చూడు పోచమ్మతల్లి

ముస్తాబాద్(సిరిసిల్ల): పాడిపంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మండలంలోని పోతుగల్‌లో గురువారం పెద్దమ్మ–పెద్దిరాజుల ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పోచమ్మ బోనాలు తీశారు.

## 'పొలంబాట'న కేసీఆర్

- ఉమ్మడి జిల్లాలో ఎండిన పంటల పరిశీలన
- అన్నదాతలకు ఓదార్పు
- సెంటిమెంట్ జిల్లాపై స్పెషల్ ఫోకస్
- ఎంపీ ఎన్నికల్లో గెలుపునకు వ్యూహాలు
- నేతలు పార్టీని వీడకుండా ప్రత్యేక సమావేశాలు
- నియోజకవర్గాల్లో నేతల మధ్య కొలిక్కిరాని అంతరాలు



మొగ్దుంపూర్‌లోఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్



మాజీ సీఎం కేసీఆర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత.. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. సాగునీరు అందక ఎండిపోయిన పంటలను పరిశీలించనున్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యాక పార్టీ అధినేతగా మాజీ సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు రావడం ఇది రెండోసారి. మార్చిలో కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన కరీంనగర్ కదనభేరీ బహిరంగ సభలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సెంటిమెంట్ జిల్లా అయిన కరీంనగర్ నుంచే ప్రచార శంఖారావాన్ని పూరించారు. తాజాగా రైతుల పొలాలను పరిశీలించనున్నారు. నీరిచ్చే అవకాశం ఉన్నా .. ఆలోచన చేయకుండా పచ్చటి పొలాలను ప్రభుత్వమే ఎండబెట్టిందని, కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్లముందు ఎండిపోతోంటే దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతన్నల్లో భరోసా నింపేందుకు కేసీఆర్ మరోసారి కరీంనగర్ రానున్నారు.

**సెంటిమెంట్ జిల్లాపై స్పెషల్ ఫోకస్**

తెలంగాణ తొలి సింహగర్జన బహిరంగ సభ నుంచి కేసీఆర్‌కు కరీంనగర్ జిల్లా అంటే సెంటిమెంట్. ఇటీవల కరీంనగర్ కదనభేరి బహిరంగ సభతో కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపారు. గెలుపోటములు సహజమని, పదేళ్లు జనరంజకమైన పాలన సాగించామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అడ్డగోలు హామీలతో జనం మోసపోయి ఓట్లు వేశారని, రానున్న రోజులు బీఆర్‌ఎస్ పార్టీదేనని ధైర్యం నింపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఆవశ్యకత, కాంగ్రెస్ హామీల అమలుపై క్షేత్రస్థాయిలో ప్రజలను జాగృతం చేసే పనిలో బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుండాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ మైండ్‌గేమ్ ఆడుతున్నాయని, ఆ విష ప్రచారంలో కార్యకర్తలు చిక్కుకోకుండా చూడాలని, కేడర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులకు ఇదివరకే కేసీఆర్ సూచించినట్లు పార్టీ వర్గాల సమాచారం.

**రెండు పార్లమెంట్ స్థానాలపై గురి**

కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలుపించుకునే దిశగా మాజీ సీఎం కేసీఆర్ కసరత్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్ సీనియర్ నేతలు కావడం, అపారమైన అనుభవం ఉండటం, పదేళ్లల్లో బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో వివరించి ఓటు బ్యాంకును పటిష్టపరుచుకుని ఎలాగైనా రెండు సీట్లను కైవసం చేసుకునే దిశగా పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశనం చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను తొలగించడంపైనా దృష్టి సారించినట్లు సమాచారం. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడటం, కొన్ని నియోజకవర్గాల్లో మొన్నటి వరకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారితోనే ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య అంతరాలు పెరిగిపోవడం వంటి సమస్యలపై దృష్టిసారించనున్నారు. అన్నదాతకు అండగా.. సర్కారుపై సమరం చేసేందుకు వస్తున్న బీఆర్‌ఎస్ అధినేత పర్యటనపై ఆసక్తి నెలకొంది.

**'చొప్పదండి'లో తారాస్థాయికి అసమ్మతి**

చొప్పదండి నియోజకవర్గంలో పార్టీలో అసమ్మతి తీవ్రస్థాయికి చేరుకుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే అప్పటి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వ్యతిరేకంగా జట్టుకట్టిన ద్వితీయశ్రేణి నాయకులు.. కాంగ్రెస్, ఇతరపార్టీల వైపు వెళ్లారు. తాజాగా అదే నియోజకవర్గం నుంచి కీలకంగా వ్యవహరిస్తున్న ఓ నేత సుంకె తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జిగా సుంకె కొనసాగితే ఇతర పార్టీలోకి వెళ్లడమే మంచిదని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. చొప్పదండిలో నెలకొన్న అసమ్మతిపై పార్టీ అధిష్టానం ఏ మేరకు దృష్టిసారిస్తుందో వేచి చూడాలి.

**కేసీఆర్ పర్యటన సాగుతుందిలా...**

- ఉదయం 8.30 గంటలకు ఎర్రవల్లిలోని ఫాంహౌస్ నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ చేరుకుంటారు.
- గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు.
- మధ్యాహ్నం ఒంటిగంటకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంటికి చేరుకుని అక్కడే భోజనం చేస్తారు.
- మధ్యాహ్నం రెండు గంటలకు రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండల కేంద్రంలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలిస్తారు.
- మధ్యాహ్నం 3 గంటలకు శాభాష్‌పల్లి వద్ద మిడ్‌మానేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తారు.
- సాయంత్రం 4 గంటలకు రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహిస్తారు.
- సాయంత్రం 5 గంటలకు ఎర్రవెల్లి ఫాంహౌజ్‌కు బయల్దేరుతారు.

## పలకరింపులు.. ఇఫ్తార్ విందులు..

- కేటీఆర్ బిజీ..బిజీ..



గంభీరావుపేటలోని ఇఫ్తార్ విందులో కేటీఆర్



సిరిసిల్లలోని జ్యూస్ సెంటర్‌లో విద్యార్థులతో..

సిరిసిల్లటౌన్/గంభీరావుపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్లలో గురువారం సందడి చేశారు. వెంకంపేటలోని మార్గం ఫంక్షన్‌హాల్‌లో గడ్డం భూంరెడ్డి–పద్మ దంపతుల కూతురు వివాహానికి హాజరయ్యారు. మ్యాన వెంకటేశం–కళావతి కొడుకు పెళ్లి ఇటీవల జరుగగా వారింటికెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. పాతబస్టాండులో కంచర్ల రవిగౌడ్ జ్యూస్ సెంటర్‌కు వెళ్లి అక్కడ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. బస్టాండులో పలువురు ప్రయాణికులను పలుకరిస్తూ..సెల్ఫీలు దిగారు. సర్దాపూర్‌లో పెద్దమ– పెద్దిరాజుల కల్యాణోత్సవానికి హాజరయ్యారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, గూడూరి ప్రవీణ్ ఉన్నారు.

**ఇఫ్తార్‌విందులో..**

గంభీరావుపేట మండల కేంద్రంలోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కేటీఆర్, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ హాజరయ్యారు. ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, జెడ్పీ కో–ఆప్షన్ అహ్మద్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణశాఖ అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, వెంకటియాదవ్, మహబూబ్ అలీ, నవాజ్‌ఖాన్, వహీద్, ఖుతుబ్, నాయకులు దయాకర్‌రావు, రాజారాం, రాజు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపీపీ వంగ కరుణ కూతురు వివాహం, లింగన్నపేటలో బీఆర్‌ఎస్ నాయకుడు చింతల కిష్టయ్య కూతురు వివాహానికి హాజరయ్యారు.

**ప్రత్యేక పూజలు**

వీర్నపల్లి మండలంలోని రంగంపేటలోని శ్రీసీతారామ ఆలయ ప్రతిష్ఠ, బంజేరులోని ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలకు ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ హాజరయ్యారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జైలు

**ముస్తాబాద్(సిరిసిల్ల):** బైండోవర్‌ను అతిక్రమించిన మహిళకు ముస్తాబాద్ మండల ఎక్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సురేష్ ఏడాది జైలుశిక్ష విధించారు. ఆబ్కారీ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన రాధిక నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. గతంలో పట్టుబడ్డ రాధికను అధికారులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. తిరిగి సారా విక్రయిస్తూ రాధిక మళ్లీ పట్టుబడింది. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన రాధికను గురువారం తహసీల్దార్ ముందు హాజరుపర్చగా.. రూ.లక్ష జరిమానా విధించారు. రూ.లక్ష జరిమానా రాధిక చెల్లించకపోవడంతో ఏడాది జైలుశిక్ష విధించారు. నిందితురాలిని కరీంనగర్ మహిళ జైలుకు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

### వృద్ధురాలి మెడలోని బంగారం అపహరణ

**కథలాపూర్(వేములవాడ):** మండలంలోని రాజారాంతండాలో అపావత్ బిక్కి అనే వృద్ధురాలి మెడలోని అర తులం బంగారం బిల్లను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తుల వివరా ల ప్రకారం.. గ్రామానికి ఇద్దరు కొత్త వ్యక్తులు బైక్‌పై వచ్చి కోళ్లను కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు స్థానికులతో బుధవారం రాత్రి ముచ్చటించారు. అపావత్ బిక్కి అనే వృద్ధురాలు తన ఇంటి ముందు మంచంలో పడుకుంది. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడ లోంచి బంగారం బిల్లను లాక్కొని పరారయ్యా రు. వృద్ధురాలు అరవడంతో వెంబడించామని, వారు దొరకలేదని స్థానికులు పేర్కొన్నారు.

### జాతీయ బాలల కథా సంకలనానికి ఎంపిక

**కరీంనగర్ కల్చరల్:** కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, విమర్శకుడు, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ రచించిన మారిన సోమరాజు అనే కథ జాతీయ స్థాయి బాలల కథా సంకలనానికి ఎంపికైంది. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బాలల కథా సంకలనం ప్రచురించేందుకు జాతీయ స్థాయిలో బాలల కథలను ఆహ్వానించింది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన బాలసాహితీవేత్తలు రచించిన 256 కథలు పరిశీలనకు రాగా, అందులో నుంచి 86 కథలను ఎంపిక చేశారు. వీటిలో ప్రభాకర్ రచించిన కథ కూడా ఉందని సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తెలిపారు.

### హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

**ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం):** పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో బుధవారం రాత్రి చిట్టబోయిన చందు(50)పై పాత కక్షలతో కత్తితో దాడి చేసిన ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చింతలచెరువు చేపలు పట్టే విషయమై ముదిరాజ్ కులస్తులు, చిట్టబోయిన చందు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. బుధవారం రాత్రి పొలానికి వెళ్లే సమయంలో దాసరి భిక్షపతి, లింగాల సారయ్య చందు చేతులు పట్టుకోగా.. దాసరి లక్ష్మీనారాయణ కత్తితో పొడిచి పారిపోయాడు. చందుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి అన్న కొడుకు చిట్టబోయిన శ్రీధర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, 24 గంటల్లోనే ఛేదించారు. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ నిందితులు దాసరి లక్ష్మీనారాయణ, దాసరి భిక్షపతి, లింగాల సారయ్యలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం



బోల్తా పడిన కారు

**ఓదెల(పెద్దపల్లి):** మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి కొలనూర్ బస్టాండ్ సమీపంలో ఓ కారు బోల్తా పడింది. ఈ ఘటనలో సాఫ్ట్‌వేర్ దంపతులు, వారి కుమారుడికి ప్రాణాపాయం తప్పింది. ఎస్సై అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన పోతునేని రమేశ్‌రెడ్డి గురువారం తన భార్య, కుమారుడితో కలిసి ముత్తారం మండలంలోని ఓడేడ్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు కారులో వచ్చారు. తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా కొలనూర్ గ్రామంలో టైరు పగలడంతో వాహనం అదుపు తప్పి, బోల్తా పడింది. చుట్టుపక్కల రైతులు, హమాలీలు సంఘటన స్థలానికి చేరుకొని, వారిని బయటకు తీశారు. బాధితులకు స్వల్ప గాయాలవడంతో స్థానికంగా ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వారి బంధువుల కారు రావడంతో అందులో వెళ్లిపోయారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చెట్లు నరికినవారికి జరిమానా

**తిమ్మాపూర్(మానకొండూర్):** చిగురుమామిడి మండలం ఇందుర్తిలో సర్వే నంబర్ 936 భూమిలోని ఖబరస్థాన్ కోర్టు వివాదంలో ఉంది. ఇందులోని చెట్లు నరికిన షేక్ పాషా, సోహైల్‌లకు రూ.20 వేల జరిమానా విధించినట్లు తిమ్మాపూర్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి గురువారం తెలిపారు. ఇందుర్తికే చెందిన షేక్ పాషా తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్‌కు చెందిన సోహైల్ ఖబరస్థాన్‌లో అనుమతి లేకుండా చెట్లు నరికి, విక్రయించారని కొంతమంది ఇటీవల చిగురుమామిడి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి, ఆ ఇద్దరికీ జరిమానా విధించినట్లు ఫారెస్ట్ అధికారి తెలిపారు.

# రాజన్న కోడెలకు వసతి కరువు

- పెడ్లు సరిపోక ఎండలోనే...
- 150 కోడెలు ఉండే షెడ్లలో వెయ్యి జీవాలు
- అనారోగ్యానికి గురవుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



తిప్పాపూర్ గోశాలలోని రాజన్న కోడెలు

**వేములవాడ అర్బన్:** వేములవాడ రాజన్న ఆలయంలోని కోడెలకు వసతి కరువైంది. గోశాలల్లో సౌకర్యాలు సరిగ్గా లేక అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇటీవల ఎండలు ముదరడంతో మరింత ఇబ్బంది పడుతున్నాయి. వసతి సౌకర్యం తక్కువగా ఉండడం.. కోడెల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాయి. షెడ్లలో కనీసం ఖాళీ స్థలం లేక ఎండలోనే విశ్రాంతి తీసుకుంటున్నాయి. ఫలితంగా అనారోగ్యం పాలవుతున్నాయి.

**భక్తుల ద్వారా ఇక్కడికి..**

రాజన్న భక్తులు తమ కోరికలు నెరవేరితే నిజకోడెను సమర్పిస్తుంటారు. తమ ఇంటిలోని కోడెను తీసుకొచ్చి ఆలయ అధికారులకు అప్పగిస్తుంటారు. ఇలా భక్తుల ద్వారా రాజన్న ఆలయానికి కోడెలు చేరుతున్నాయి. ఇలా వచ్చిన వాటి కోసం ఆలయ అధికారులు రెండు గోశాలలు ఏర్పాటు చేశారు. చెరువు కట్టకింద, తిప్పాపూర్‌లలో గోశాలలు ఉన్నాయి.

**కోడెల ద్వారా కోట్ల ఆదాయం**

రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే కోడెమొక్కుల ద్వారా ఏటా సుమారుగా రూ.10 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. కోడెల సంరక్షణకు రెండు గోశాలల్లో కలిపి ఏటా దాదాపు రూ.50లక్షల వరకు ఖర్చు అవుతుంది.

**వసతికి మించి..**

రాజన్నకు భక్తులు కోడెమొక్కులు చెల్లించే వాటి సంరక్షణకు గుడి చెరువు కట్టకింద ఉన్న గోశాలలో ఉంటున్నాయి. ఇక్కడ కోడెలు, ఆవులు కలిపి 150 వరకు ఉన్నాయి. తిప్పాపూర్ గోశాలలో 150 కోడెలను సంరక్షించేందుకు సౌకర్యాలు కల్పించారు. తిప్పాపూర్‌లో ప్రస్తుతం వెయ్యి కోడెలు ఉండంతో వసతి కరువైంది. సంరక్షణ సైతం భారంగా మారింది. దీంతో ఇటీవల మూడు కొత్త షెడ్లను నిర్మించారు. చుట్టూ ప్రహరీ నిర్మించి పైన తడుకల పందిళ్లు వేశారు. అయినా వసతి సరిపోవడం లేదు. గతంలో వేసిన షెడ్లు శిథిలావస్థకు చేరడంతో కోడెల సంరక్షణ ఇబ్బందిగా మారింది.



పాకలో కోడెలు

**రోగాల బారిన..**

రాజన్నకు కోడెమొక్కుల కోసం భక్తులు చిన్న వయసులోనే తీసుకొస్తుండడంతో ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడలేక అనారోగ్యానికి గురవుతున్నాయి. పశువైద్యాధికారుల పర్యవేక్షణ ఉన్న ఒక్కోసారి ఇబ్బంది పడుతున్నాయి.

**తెరపైకి రైతులకు ఇవ్వాలనే డిమాండ్.**

రాజన్న ఆలయానికి మొక్కుల ద్వారా వచ్చిన కోడెల సంరక్షణ ఇబ్బందిగా మారడంతో గతంలో తెలంగాణ ఫెడరేషన్ ద్వారా వివిధ గోశాలలకు అందించారు. గత జనవరిలో గోశాల పేరుతో అక్రమంగా తరలించిన కోడెల వ్యాన్‌ను సీజ్ చేయడంతో అప్పటి నుంచి బయటి గోశాలలకు ఇవ్వడం లేదు. దీంతో ఇక్కడి గోశాలలో కోడెల సంఖ్య పెరిగింది. ఇదే సమయంలో వేములవాడ చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులకు ఉచితంగా అందివ్వాలనే డిమాండ్ తెరపైకి వస్తుంది. గతంలో ఇచ్చేవారని.. ఇప్పుడు ఇస్తే రైతులకు సైతం ఆర్థికంగా చేదోడుగా ఉంటుందనే వాదన వస్తుంది.

### కోడెలను సంరక్షిస్తున్నాం



రాజన్న కోడెల కోసం తిప్పాపూర్ గోశాలలో ఇటీవల మూడు షెడ్లను ఏర్పాటు చేశాం. తడుకల పందిళ్లు వేశాం. కోడెలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంరక్షణ చేస్తున్నాం. నాంపల్లి గుట్ట ప్రాంతంలో ఉన్న రాజన్న ఆలయం ఐదు ఎకరాల భూమిలో కోడెల సంరక్షణ కోసం ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ వేయడం జరిగింది. కోడెలను రైతులకు అందించేందుకు రాష్ట్ర దేవదాయ కమిషనర్‌కు లేఖను కూడా అందించాం.

– శ్రీనివాస్, రాజన్న ఆలయ ఏఈవో

# ఎవరు పెళ్లి చేసుకుంటే వారికి లడ్డూలు

- చిన్నారులతో కేటీఆర్ చమత్కారం



చిన్నారులతో ముచ్చటిస్తున్న కేటీఆర్

**గంభీరావుపేట(సిరిసిల్ల):** రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ గురువారం సాయంత్రం పర్యటించారు. కొత్తపల్లి గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేటీఆర్ సరదాగా ముచ్చటించారు. 'ఎవరు పెళ్లి చేసుకుంటే వారికి లడ్డూలు ఇస్తా..' అంటూ చిన్నారులతో చమత్కరించారు. ఆయన వెంట కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు ఉన్నారు.

# జల్సాలకు అలవాటు పడి.. దొంగగా మారాడు



అరెస్టు చూపుతున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

**ముస్తాబాద్(సిరిసిల్ల):** జల్సాలకు అలవాటు పడ్డ ఓ వ్యక్తి దొంగగా మారి వాహనాలను చోరీ చేస్తున్నాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్‌లోని తెలంగాణ చౌక్‌లో విశాలాక్షి మెస్ వద్ద నిలిపి ఉన్న బైక్, మాతృశ్రీ గార్డెన్ నుంచి మరో బైక్ అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. కానిస్టేబుళ్లు రాజశేఖర్, దామోదర్ సీసీ ఫుటేజీ, ఇతర ఆధారాలతో దొంగను కనిపెట్టారు. ముస్తాబాద్ రాజీవ్ చౌక్ నుంచి వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకొని విచారించారు. ముస్తాబాద్‌లో రెండు బైక్‌లతోపాటు వేములవాడ తిప్పాపూర్‌లో స్కూటీని దొంగతనం చేసింది సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌కు చెందిన మంతూరి మహేశ్(37)గా గుర్తించారు. 3 వాహనాలను స్వాధీనం చేసుకొని, అతన్ని రిమాండ్‌కు తరలించారు.

# ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి విద్యార్థి మృతి
- అల్మాస్‌పూర్‌లో విషాదం



హరికృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

**ఎల్లారెడ్డిపేట:** ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. ఉన్నతంగా చదువుకొని కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థి మృతి ఆ గ్రామంలో విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన గొల్లేని(ఆలకుంట) లక్ష్మి–వెంకటి దంపతులకు ఇద్దరు కొడుకులు రాజశేఖర్, హరికృష్ణ(15), ఒక కూతురు. రాజశేఖర్ దుబాయిలో ఉండగా, హరికృష్ణ ఇటీవలే పదోతరగతి పరీక్షలు రాశాడు. హరికృష్ణ తండ్రి వెంకటి అల్మాస్‌పూర్ గ్రామంలో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తున్నాడు. తండ్రితోపాటు హరికృష్ణ సైతం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి సమీపంలోని రంగంచెరువులో ఈత కొట్టేందుకు ఒంటరిగా వెళ్లాడు. ఈత కొడుతుండగానే ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. అప్పటి వరకు కళ్ల ముందు తిరిగిన కొడుకు జీవచ్ఛవంగా పడి ఉండడాన్ని చూసి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అందరితో కలివిడిగా ఉంటే హరికృష్ణ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# గంజాయి మాయంపై నివేదిక

- సారంగాపూర్ ఠాణా ఘటనపై ఉన్నతాధికారుల ఆగ్రహం!
- ఆరోజు విధుల్లో ఉన్న పోలీసులపై చర్యలకు రంగం సిద్ధం?



పోలీసులు పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

**జగిత్యాల క్రైం:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి సీజ్ చేసిన 70 కిలోల గంజాయి మాయమైన ఘటనపై రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. స్థానిక పోలీసులు నాలుగు రోజులుగా పలు బృందాల ద్వారా తనిఖీలు చేపట్టినా ఎలాంటి ఆధారాలు దొరకలేదు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించినా ఫలితం లేకపోవడంతో ఫలితం లేకపోయింది. గురువారం సాయంత్రం జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ కూడా లోతుగా విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసి, బదిలీపై వెళ్లిన ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను అనుమానిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దీనిపై నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గంజాయి మాయమైన రోజు ఠాణాలో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

**విధులకు జంకుతున్న సిబ్బంది**

సారంగాపూర్ ఠాణాలో ఏడాదిగా విధులు నిర్వహించాలంటే పోలీస్ సిబ్బంది జంకుతున్నారు. పోలీస్‌స్టేషన్ అటవీ ప్రాంతంలో ఉండటం, గతంలో నక్సల్స్ ప్రభావం ఉన్న ఏరియా కావడం, ఇటీవల ఓ వడ్డీ వ్యాపారి ఠాణా నుంచి పారిపోవడం, ఇప్పుడు గంజాయి మాయమవడం వంటి ఘటనలు ఇక్కడి పోలీసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**జాతరల సమయంలోనే?**

ఠాణా నుంచి గంజాయి మాయమైన ఘటనపై పోలీసులకు ఇప్పటికీ ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఎప్పుడు ఎతుకెళ్లారో కూడా నిర్ధారణ కావడం లేదు. బీర్‌పూర్ నృసింహస్వామి, దుబ్బరాజేశ్వరస్వామి జాతరల్లో పోలీసులు బిజీగా ఉండటం చూసి, గంజాయిని మాయం చేసి ఉండొచ్చన్న అనుమానాలున్నాయి.

# నెల రోజుల క్రితం గల్ఫ్ నుంచి వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి..
- చికిత్స పొందుతూ యువకుడి మృతి



బాలాజీ (ఫైల్)

**కోరుట్లరూరల్:** వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల బాలాజీ(25) అనే యువకుడు వారం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గత నెలలో హోలీ పండుగ రోజు తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకొని వెంకటాపూర్ గ్రామానికి తిరిగి వస్తుండగా.. గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారం రోజులుగా కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం బుధవారం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతిచెందాడు. బాలాజీ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన ఖతార్ వెళ్లి నెల రోజుల క్రితమే సెలవుపై వచ్చాడు. అనుమల్ల మాధురి–సత్తయ్య దంపతులకు ఇద్దరు కుమారులు కాగా.. తండ్రి, తన ఇద్దరు కుమారులు గల్ఫ్‌లోనే ఉపాధి పొందుతున్నారు. కొడుకు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని తెలిసిన తండ్రి సత్తయ్య తెల్లవారే హుటాహుటిన స్వగ్రామానికి చేరుకున్నాడు. కొడుకుతోనే ఆసుపత్రిలో ఉన్నాడు. ఐనా బాలాజీ మృతిచెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



ఆంజనేయులు (ఫైల్)

**శంకరపట్నం(మానకొండూర్):** బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలంలోని చింతగట్టుకు చెందిన సిరిసిల్ల ఆంజనేయులు(33), మంద హరీశ్ మామాఅల్లుడు. గురువారం జమ్మికుంటలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా కేశవపట్నం బస్టాండ్ వద్ద సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బైక్‌పై వెనకాల కూర్చున్న ఆంజనేయులు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హరీశ్ క్షేమంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య పూజ, ఇద్దరు కుమారులు సాయి గణేశ్, సాత్విక్ ఉన్నారు. ఆంజనేయులు గ్రామంలో జరుగుతున్న పోచమ్మ బోనాలకు వచ్చినా బతికేవాడని కుటుంబసభ్యులు రోదించడం పలువురిని కంట తడి పెట్టించింది.

### తొలిరోజు జేఈఈ మెయిన్స్ ప్రశాంతం



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

**తిమ్మాపూర్(మానకొండూర్):** మండలంలోని వాగేశ్వరి కళాశాలలో జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కళాశాల అయాన్ డిజిటల్ సెంటర్‌లో ఈ నెల 12వ తేదీ వరకు, ప్రతీరోజు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయని సిటీ కో–ఆర్డినేటర్ లలితకుమారి తెలిపారు. విద్యార్థులను గంటన్నర ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతించామన్నారు. తొలిరోజు ఉదయం 676 మందికి 598 మంది, సాయంత్రం 676 మందికి 610 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎల్ఎండీ ఎస్సై చేరాలు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్:** కరీంనగర్ జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీవిద్యార్థులకు రెండు నెలల కాలానికి డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ పి.నతానియేలు ఒక ప్రకటనలో తెలిపారు. భోజన వసతితో కూడిన రెసిడెన్షియల్ కోచింగ్ ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన ఎస్సీ అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 7 లోపు అంబేడ్కర్ భవన్‌లోని టీఎస్ స్టడీ సర్కిల్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్స్ జిరాక్స్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఏదైనా టెట్, బీఈడీ, డైట్, టీటీసీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఎస్ఎస్‌సీ, డిగ్రీ మార్కుల మెమో, బీఈడీ, టెట్, టీటీసీ, డైట్, ప్రొవిజనల్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాసుపోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9885218053, 9573401227, 9177605511 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

# రైల్లో నుంచి పడి యువకుడి దుర్మరణం



రాజ్‌కుమార్ మృతదేహం

**జమ్మికుంట(హుజూరాబాద్):** రైల్లో నుంచి పడి, ఓ యువకుడు మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రంలోని ఛత్ర జిల్లా కోటప్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(18) హైదరాబాద్‌లో కూలీ పని చేస్తున్నాడు. తన స్వగ్రామం వెళ్లేందుకు బుధవారం రాత్రి సికింద్రాబాద్‌లో పాట్నా స్పెషల్ ట్రైన్ ఎక్కాడు. ఉప్పల్, జమ్మికుంట రైల్వేస్టేషన్ల మధ్య కిందపడి మృతిచెందాడు. అయితే, అతను ప్రమాదవశాత్తు పడి ఉంటాడని లేదా ఇతర కారణాల వల్ల మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు

**ఇల్లందకుంట(హుజూరాబాద్):** స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 27 వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్యాణ మండపం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసి జాతరను విజయవంతం చేయాలని అన్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, ఆలయ ఈవో కందుల సుధాకర్, సీఐ సురేశ్, ఎస్సై రాజ్‌కుమార్, ఆర్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భవన్‌లో నాటికల ప్రదర్శన




**కొత్తపల్లి(కరీంనగర్):** టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గురువారం రాత్రి విద్యుత్ ఉద్యోగులు ప్రదర్శించిన చీకటి పువ్వు, ఖరీదైన జైళ్లు నాటికలను సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం నాటికలను తిలకించారు. ఇన్‌చార్జి డైరెక్టర్లు రాజు చౌహాన్, అశోక్ కుమార్, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈలు గంగాధర్, సత్యనారాయణ, డీఈలు విజయేందర్ రెడ్డి, చంద్రమౌళి, రాజం, తిరుపతి, గోపీకృష్ణ, ఏడీఈలు, ఏఈలు, కళాకారులు రమేశ్, లహరి, ఉదయ్‌కుమార్, శోభారాణి, అనిల్, వెంకటనారాయణ, సత్యనారాయణ, విజయ్‌కుమార్, వెంకటేశ్, రిషికాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఫైనాన్స్ వ్యాపారి కుచ్చుటోపీ

- దాదాపు రూ.3 కోట్లతో ఉడాయించాడంటున్న బాధితులు
- సోషల్ మీడియాలో ప్రచారం

**హుజూరాబాద్‌రూరల్:** తక్కువ వడ్డీకి పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు.. ఆ డబ్బులతో ఎక్కువ వడ్డీకి ఫైనాన్స్ చేయడంతోపాటు పలువురితో చిట్టీలు వేయించిన ఓ ఫైనాన్స్ వ్యాపారి వారికి కుచ్చుటోపీ పెట్టాడు. దాదాపు రూ.3 కోట్లు ఉడాయించాడని బాధితులు లబోదిబోమంటున్నారు. వారి వివరాల ప్రకారం.. గతంలో హుజూరాబాద్‌లో అక్రమ ఫైనాన్స్‌లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆ సమయంలో సదరు వ్యాపారి లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడటంతో అప్పులు ఇచ్చినవారు తమ డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలోనే అతను కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ ససేమిరా అన్నారు. దీంతో ఆ వ్యాపారి పరారయ్యాడు. ఈ విషయమై సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. తమ డబ్బులు ఎలా వస్తాయోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు. కానీ, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

### కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలి



పుస్తకాలు ఇస్తున్న బీఎస్.రావు

**కరీంనగర్:** కరీంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్‌కు ఫ్రీ కోచింగ్ తీసుకుంటున్న వారికి డాక్టర్ బీఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే రూ.30వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను బీఎస్.రావు తన సతీమణి గంగతో కలిసి గురువారం అందజేశారు. అభ్యర్థులు మాట్లాడుతూ.. ఫౌండేషన్ వారిచ్చిన మెటీరియల్ పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సంతోషాన్ని వెలిబుచ్చారు. బీఎస్.రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉచిత కోచింగ్‌కు ఎంపికై గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి తన ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. అభ్యర్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. డాక్టర్ జి.ఎస్.రావు–గంగా దంపతులు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, అల్లం సాయికృష్ణ, సిబ్బంది ఉన్నారు.